## క్లుప్తంగా

### నవధాన్యాల కిట్లు పంపిణీ



నవధాన్యాల కిట్లు తీసుకువెళ్తున్న మహిళలు

రేగిడి: మండలంలోని అంబకండి, గుళ్లపాడు, ఉంగరాడ, రేగిడి, చాటాయవలస గ్రామాల్లోని మహిళా రైతులకు నవధాన్యాల కిట్లు ఆదివారం పంపిణీ చేశారు. రాయితీ పోను ఒక్కో కిట్టు విలువ రూ.350 అని ప్రకృతి వ్యవసాయం పీఆర్పీ రమాదేవి తెలిపారు.

### అందుబాటులోకి ఫ్రీజర్ బాక్సు



ఫ్రీజర్ బాక్సును ప్రారంభిస్తున్న రమణ

వంగర: మండల కేంద్రానికి దాతలు సమకూర్చిన ఎలక్ట్రికల్ ఫ్రీజర్(విద్యుత్ శీతల శవపేటిక) బాక్సును జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కాంబోతుల రమణ ఆదివారం వంగరలో ప్రారంభించారు. ఆ బాక్సును రాజాం పట్టణానికి చెందిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వితరణ చేసినట్లు ఆయన తెలిపారు. బాక్సు కావాలనుకునే వారు ఫోన్ నంబరు 9441414966ను సంప్రదించాలని కోరారు.

### రూ.4 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణం



సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. ఎస్సీ కాలనీలో రూ.4 లక్షల పంచాయతీ నిధులతో ఆదివారం సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. ఈ పనులను వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేయాలన్నారు. పంచాయతీలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, మురుగుకాలువలు నిర్మిస్తున్నామన్నారు.

### మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న శ్రీనివాసరావు

రాజాం: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు అన్నారు. ఆయన తన పుట్టినరోజు వేడుకల్లో భాగంగా స్థానిక వైఎస్సార్ పార్కు వద్ద మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, పరిరక్షించాలని తద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సమితి కో–ఆర్డినేటర్ ఆర్‌వీజే నాయుడు, సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ

రాజాం/సంతకవిటి: విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంతకవిటి మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు ఆదివారం పరామర్శించారు. సరిగ్గా రెండు రోజుల క్రితం శ్రీకాకుళంలోని మహిళా డిగ్రీ కళాశాల వసతిగృహం వద్ద జరిగిన దుర్ఘటనలో సదరు విద్యార్థిని గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమెకు అందుతున్న వైద్యసేవలు, ఆరోగ్యం మెరుగుపడుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. విద్యార్థినికి న్యాయం జరిగేలా పోరాడతామని ధైర్యం చెప్పారు.

### చెట్లకొమ్మల తొలగింపు



చెట్లకొమ్మలు తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామం నుంచి ఉంగరాడమెట్ట, సంకిలి, బూరాడ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాకి అంతరాయం కలిగించే చెట్లకొమ్మలను ఆదివారం తొలగించారు. విద్యుత్ వైర్లను ఆనుకుని ఉన్న చెట్లకొమ్మలను సిబ్బంది కట్ చేశారు.

# పంట మార్పు.. ఆదాయం ఆర్జించు!

- పంటల మార్పిడితో అధిక రాబడులు
- రబీ సీజన్‌లో సాగుపై రైతుల దృష్టి
- రాగి, నువ్వు, వేరుశనగ పంటల సాగు
- కూరగాయల్లో క్యాబేజి, సారికంద వంటివి సేద్యం

రాజాం: రైతులో మార్పు కనిపిస్తోంది. అక్షరసేద్యం సుస్పష్టంగా దర్శనమిస్తోంది. అన్నదాతకు చదువు తోడైతే ఫలితాలు బాగుంటాయన్న విషయం రుజువు అవుతోంది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు భరోసా కేంద్రాలు.. గ్రామీణ వ్యవసాయంలో సమూల మార్పులను తీసుకువచ్చింది. రైతన్నకు వ్యవసాయ విజ్ఞానంతో పాటు సాంకేతికతను అందించింది. వారితో సత్ఫలితాలు సాధించేలా చేసింది. ముఖ్యంగా రైతులతో పంట మార్పిడి చేయించి, అధిక రాబడులు ఆర్జించేలా చర్యలు తీసుకుంది. దీంతో ప్రస్తుతం రబీ సీజన్‌లో అంతటా పంటల మార్పిడి కనిపిస్తోంది. ఇది రైతు సాగులో మార్పును సూచిస్తోంది. ఇదొక శుభసూచకమేనని, అన్నదాతకు మేలు కలిగే విషయమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు..



పోతులజగ్గుపేట వద్ద సారికంద సాగు ఇలా..

#### పంటమార్పిడిపై అవగాహన..

గతంలో రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వరి, మొక్కజొన్న పంటలనే ఆయా ప్రాంతాల్లో మళ్లీ రబీ సీజన్‌లో కూడా పండించేవారు. కొన్నిప్రాంతాల రైతులు అయితే సాగునీరు లేకపోవడంతో ఖరీఫ్ అనంతరం పొలాలను అలాగే ఖాళీగా మళ్లీ ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు లభ్యమయ్యే దాకా వదిలేసేవారు. కనీసం అపరాల పంటలను సాగు చేసే పరిస్థితి కూడా కనిపించేది కాదు. ఫలితంగా భూసారం తగ్గి, ఆశించిన ఫలితాలు వచ్చేవి కావు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటైన దగ్గర నుంచి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు రైతులకు అందుబాటులో ఉండి, పంటల మార్పిడి ప్రయోజనాలపై అవగాహన కల్పించడం, అగ్రిల్యాబ్‌ల ద్వారా భూసార పరీక్షలు చేసి నేలరకం అనుగుణంగా పంటలు వేసే విధానం తెలపడం రైతులకు కలసివచ్చింది. ఇలా ఇప్పుడు అన్నిచోట్లా పంటమార్పిడి విధానం రైతులు అవలంబిస్తుండడం కనిపిస్తోంది. ప్రస్తుతం రాజాం, రేగిడి, సంతకవిటి మండలాల్లో గతంలో లేని రాగి, నువ్వు, వేరుశనగ, సారికంద వంటి పంటల సాగు దర్శనమిస్తోంది. రబీ సీజన్‌లో ఎప్పుడూ వేసే అపరాలు, మొక్కజొన్న పంటలను పక్కనబెట్టి, ఇప్పుడు ఆయా రకాల పంటలు సాగు చేయడం ట్రెండ్‌గా మారింది. ఏది ఏమైనా పంట మార్పిడి చేసిన నాటి నుంచి బాగా ఆదాయం లభిస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నందబలగ దగ్గరలో ఏపుగా పెరిగిన రాగి పంట



గుయ్యానవలస సమీపంలో నువ్వు సాగు

#### రూ.15 వేల వరకు ఆదాయం..

నియోజకవర్గంలో సాగునీటి సదుపాయాలు ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా రాగిపంటను సాగు చేస్తున్నారు. ఈ పంట ద్వారా ఎకరా సాగుకు రూ.15 వేల వరకు ఆదాయం వస్తోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఈ ఏడాది 112 ఎకరాల్లో ఈ పంట సాగులో ఉంది. నువ్వు పంటను ఎక్కువగా రాజాం, వంగర, రేగిడి మండలాల్లో పండిస్తున్నారు. ఎకరా సాగులో రూ.14 వేల ఆదాయం వచ్చే ఈ పంటకు పెట్టుబడి పెద్దగా ఉండదు. నియోజకవర్గంలో 423 ఎకరాల్లో ఈ పంట సాగులో ఉంది. వీటితో పాటు వేరుశనగ సాగు కొత్తగా రాజాం, రేగిడి, సంతకవిటి మండలాల్లో ఈ ఏడాది చేయడం జరుగుతోంది. ఈ పంటకు ఈ ఏడాదే మంచి డిమాండ్ ఉంది. ఎకరా సాగులో రూ.16 వేల వరకు ఆదాయం లభిస్తోంది. వీటి తర్వాత పలుచోట్ల కూరగాయల సాగు పంటపొలాల్లో చేపడుతున్నారు. వినూత్నంగా సారికంద సాగు కూడా రాజాం, సంతకవిటి మండలాల్లో అధికంగా కనిపిస్తుండడం విశేషం. ఇవే కాకుండా క్యాబేజి, ఎర్రదుంప, టమాటా పంటల సాగు కూడా ఈ ఏడాది పలుచోట్ల పంటపొలాల్లో కొత్తగా కనిపిస్తున్నాయి. దీనంతటికీ గత ప్రభుత్వ కృషితో పాటు ప్రకృతి వ్యవసాయ విధానాలే ఇందుకు కారణమని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు.

#### మార్కెట్‌లో మంచి డిమాండ్..

మా పొలాల్లో ఈ ఏడాది రాగి పంట సాగు చేస్తున్నాం. రాగి గింజలకు, రాగిపిండికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. పంట కూడా నష్టపోకుండా చేతికి వస్తోంది. పంట మార్పిడికి అవకాశం కూడా లభించింది.

–కె.రమారావు, రైతు, నందబలగ, రాజాం మండలం

#### గతంలో కొర్ను వదిలేసే వాళ్లం..

నువ్వు పంటకు ఇప్పుడు బాగా డిమాండ్ ఉంది. అందుకే ఈ పంటను సాగు చేస్తున్నాం. గతంలో పొలాలను కొర్నుకు వదిలేసేవాళ్లం. వ్యవసాయ సిబ్బంది ఆరుతడి పంటల మాదిరి ఉండే నువ్వు పంటను సాగు చేయమని సలహా ఇచ్చారు. అందుకే ఈ పంట వేశాం. ప్రస్తుతం పూతదశలో ఉంది. కొద్దిరోజుల్లో కోత చేస్తాం.

– ఎం.వెంకటరావు, రైతు, గుయ్యానవలస, రాజాం మండలం

## ఇంగ్లిష్ ప్రతిభా పరీక్షకు 347 మంది హాజరు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొబ్బిలి: స్థానిక రాజా కళాశాలలో డెల్టా(జిల్లా ఇంగ్లిష్ భాషోపాధ్యాయుల సంఘం) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇంగ్లిష్ ప్రతిభా పాటవ పరీక్షకు ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి మొత్తం 347 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మందికి నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, ఇంగ్లిష్ గ్రామర్ పుస్తకాలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కె.మోహనరావు, ఎంఈవో గొట్టాపు వాసు, డెల్టా అధ్యక్షుడు మింది విజయమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

#### 8,9వ తేదీల్లో హిందీ పరీక్షలు..

రాజాం: దక్షిణ భారత హిందీ ప్రచార సభ, చెన్నై ద్వారా ఈ నెల 8, 9వ తేదీల్లో హిందీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు కూడా విడుదలయ్యాయన్నారు. హిందీ ప్రచారక్‌లు, పరీక్షా కేంద్రాల వద్ద ఈ హాల్‌టికెట్లు ఇస్తున్నారని, పరీక్షకు అరగంట ముందుగా వచ్చి, వీటిని తీసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 9949917365ను సంప్రదించాలని కోరారు.

### తప్పిన ప్రమాదం

రాజాం సిటీ: స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఆదివారం పెనుప్రమాదం తప్పింది. పాలకొండ వైపు నుంచి వస్తున్న లారీ శ్రీకాకుళం వైపు మలుపు తిరుగుతున్న సమయంలో డ్రైవరు బీభత్సం సృష్టించాడు. మద్యం మత్తులో ఉన్న ఆ డ్రైవరు లారీని వేగంగా రాంగ్‌రూట్‌లో తిప్పడంతో ఎదురుగా వస్తున్న వాహనదారులు భయాందోళనకు గురై, వాహనాలను నిలిపివేశారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవరుకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

### పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు

తెర్లాం: పుస్తక పఠనంతో ఎంతో మేలు అని, ప్రతీ విద్యార్థి ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తకాలు చదవడం అలవాటుగా చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు పుస్తక పఠనం ఎలా చేయాలో లైబ్రేరియన్ నేర్పించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా మంచి విజ్ఞానం కలుగుతుందని చెప్పారు. పాఠ్య పుస్తకాలతో పాటు నీతికథల పుస్తకాలు, దేశ నాయకుల జీవిత చరిత్ర పుస్తకాలు, ఇతిహాస పుస్తకాలు, కాంపిటేటివ్ పరీక్షల పుస్తకాలను చదవాలన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో విద్యార్థులంతా చేరాలని కోరారు.



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

### ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

రేగిడి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని వావిలవలస గ్రామంలోని శ్రీరామ ధర్మ క్షేత్రంలో ఆధ్యాత్మిక దివ్య మహాసభ ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెట్లు ఫలాలను కాసి ఇతరులకు ఉపయోగపడుతున్నాయని, నదులు కూడా ప్రవహిస్తూ ఇతరులకు ఉపయోగపడుతున్నాయని, గోవులు పాలిచ్చి పరోపకారం చేస్తున్నాయన్నారు. మానవుని శరీరం కూడా పరుల కోసం ఉపయోగపడాలన్నారు. గ్రామానికి చెందిన జగన్నాథస్వామి చిరు వ్యాపారి అయినప్పటికీ ఆయనలో దాతృత్వ గుణం ఉండడంతో నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారని అభినందించారు.

### శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు




తెర్లాం పాఠశాలలో ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాథరావు

తెర్లాం: పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ఎంఈవో జె.త్రినాథరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక తరగతులను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. శతశాతం ఉత్తీర్ణత సాధనకు 100 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం పెడుతున్నామన్నారు.

### • మంచు కురిసే వేళలో..

ఉదయం ఎనిమిదిన్నర గంటలు.. ఏమిటీ వెలుతురు రాలేదని.. కళ్లు నులుముకుని ఇంటి బయటకు వెళ్తే అంతా మంచుమయం. ఆదివారం అన్నిచోట్లా దట్టంగా కురిసిన పొగమంచు ప్రకృతి ప్రేమికులను అలరించింది. మరోవైపు దగ్గరకు వెళ్తే తప్ప ఎక్కడ ఏం ఉందో కనిపించని పరిస్థితితో అత్యవసర పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సిన వారు ఇబ్బందులు పడ్డారు. గత నెలరోజులుగా ఇదే వాతావరణం ఉండడంతో ముఖ్యంగా వాహనదారులు, రైతులు అవస్థలు పడుతున్నారు. ఇంకెన్నాళ్లు ఇలా ఉంటుందోనని అంటున్నారు.

–బొబ్బిలి/బాడంగి/రామభద్రపురం/వంగర



బాడంగి మండల కేంద్రాన్ని కమ్మేసిన పొగమంచు



మంచు కారణంగా బొబ్బిలిలో వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉదయం 9 గంటలైనా కనిపించని సూర్యోదయం



వంగర మండలం, కొండచాకరాపల్లి పొలాల్లో అలుముకున్న మంచు



వంగర రోడ్డులో కురుస్తున్న మంచు

### • పంటకు చీరకట్టు



సంతకవిటి మండలం, ముకుందపురం రైతుల వినూత్న ఆలోచనకు అందరూ ఫిదా అవుతున్నారు. మూగజీవాల నుంచి పంటలు కాపాడుకునేందుకు ఇలా పొలం చుట్టూ రంగురంగుల చీరలు కట్టారు. అటువైపుగా వెళ్తున్న వారు రైతుల సరికొత్త ఆలోచనకు సలామ్ కొడుతున్నారు.

–సంతకవిటి

### • ఆధ్యాత్మిక సందడి



సంతకవిటి మండలం, గోవిందపురంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీసీతారామచంద్ర ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో రెండో రోజు అయిన ఆదివారం ఉదయం ప్రముఖ వేద పండితులు రేజేటి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు పులఖండం శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో ప్రాతఃకాలార్చన, సూర్యారాధన అనంతరం ఆలయ ఆవరణలో పెద్దసంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు. ఆ తర్వాత జలాధివాసం, క్షీరాధివాసం, సర్వదేవతా మంత్ర హోమాలు, ధాన్యాధివాసం, షోఢన్యాసాలు, శయ్యాధివాసం, విశేష హోమాలు, దిగ్బలి, వేదస్వస్తి కార్యక్రమాలు చేశారు.

–సంతకవిటి

### • ప్రకృతి సేద్యం.. లాభదాయకం..



ప్రకృతి సేద్యం లాభదాయకమని, ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకురావాలని ప్రకృతి సాగు ట్రైనర్ పి.గౌరీశ్వరరావు కోరారు. మండలంలోని సోమరాజుపేటలో ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలు, వివిధ పంటల సాగుపై ఆదివారం అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వినియోగం పెంచి, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలని అప్పుడే ఆరోగ్యవంతమైన పంట అధిక దిగబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సవలాపురపు ముద్దలమ్మ, మాజీ ఎంపీటీసీ సవలాపురపు నర్సింహప్పారావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

–రేగిడి

## పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



అమ్మవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే శంబంగి పూజలు

బాడంగి: మండల కేంద్రంలో పోలమాంబ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడో రోజు అయిన ఆదివారం ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ప్రాణప్రతిష్ఠ చేశారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఉత్సవాలకు హాజరై, అమ్మవారిని దర్శించుకున్నారు. అందరూ సుఖసంతోషాలతో జీవించేలా చూడాలని పోలమాంబ అమ్మవారిని వేడుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ సభ్యులు దేవరాపల్లి శ్రీనువాసరావు, మాజీ సర్పంచ్ అంబటి తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి



మంచు కారణంగా తెగుళ్లు బారినపడిన మామిడి పూత



సింగిరెడ్డివలసలో మామిడి పూతను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి మోహన్‌కృష్ణ

తెర్లాం: కొన్నిరోజులుగా మంచు కురుస్తున్న కారణంగా మామిడితోటలను ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రామభద్రపురం ఉద్యానవన శాఖాధికారి పి.మోహన్‌కృష్ణ సూచించారు. మండలంలోని సింగిరెడ్డివలస, సీతారాంపురం గ్రామాల్లోని మామిడితోటలను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం అధిక ఉష్ణోగ్రతలు, మంచు కారణంగా మామిడి తోటలను ఆశించే తెగుళ్లను గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మామిడి తోటల్లో ఎక్కువగా పూత, పిందెను తినే పచ్చపురుగు, పగటి వేళల్లో ఉష్ణోగ్రత పెరగడంతో తామర పురుగులు, ఉదయం, రాత్రి వేళల్లో మంచు కారణంగా వచ్చే బూడిద, బూజు తెగుళ్ల మామిడి పూతను ఆశిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ పురుగులు, తెగుళ్లను సకాలంలో గుర్తించి వాటి నివారణ చర్యలు తీసుకోకపోతే మామిడి పూత నాశనమయ్యే అవకాశం ఉందన్నారు. మామిడిని ఆశించే బూడిద, బూజు తెగులును నివారించేందుకు రైతులు థయోమిథాక్సిమ్ 0.5 గ్రాములు, హెక్సాకొనజోల్ 2ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పూతపై స్ప్రే చేయాలని చెప్పారు. పూత, పిందెను తినే పచ్చ పురుగులను నివారించేందుకు పైన చెప్పిన మందులతో పాటు ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మామిడి పిందెలు రాలిపోకుండా నిలబడడానికి ప్లానోఫిక్స్–44 గ్రాములు, బోరాన్–88 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేస్తే పిందెరాలడం తగ్గుతుందన్నారు.